దర్బార్ మైసమ్మ బోనాలకు భారీ ఏర్పాట్లు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని

గోల్కొండ: శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయ బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దర్బార్ మైసమ్మ ఆలయ బోనాల ఏర్పాట్లపై శుక్రవారం కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్, వివిధ నాయకులు, ఆలయాల వారి సలహాలు అడిగి తెలుసుకున్నారు. బోనాల ఊరేగింపునకు పెద్ద సంఖ్యలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారని, ప్రకటిస్తున్నారే తప్పా 100 లైట్లు కూడా ఏర్పాటు చేయడం లేదని మంత్రికి ఫిర్యాదు చేశారు. అంబారీ ఊరేగింపునకు రోడ్డు ఆక్రమణలు అడ్డు వస్తారని, బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పుట్‌పాత్ రోడ్లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, బోనాల ఊరేగింపుకు రోడ్ల ఆక్రమణలు అడ్డుగా ఉంటున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. బోనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, బోనాలు నిర్వహించే ప్రతి ఆలయానికి ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. జూలై 10న బోనాల నిర్వహణ కోసం ఆర్థిక సహాయం దరఖాస్తు చేసుకున్న ఆలయాల వారికి చెక్కులు అందిస్తామన్నారు. ఊరేగింపులో, ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అమర్ సింగ్, బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్, బల్దియా జోనల్ కమిషనర్ రవి కిరణ్, సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ కరే తదితరులున్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

యాకుత్‌పురా: హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని ప్రముఖ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం, ఆలిజాకోట్లా శ్రీ కోట మైసమ్మ ఆలయంలో అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్ దంపతులు, ఆలయ సభ్యులు చేతన్ కుమార్ సూరి, దీక్షిక సూరి, ఎం.ముఖేశ్ యాదవ్‌ల కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు న్విహించారు. ఈ సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ యాదవ్, బాబురావు, పి.వెంకటేశ్ తదితరులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ప్రతినిధులను సన్మానించారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం



అబిడ్స్: గోషామహల్‌లో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన 15మంది నాయకులు సమావేశమై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్‌ను 15 మందిలో ఎవరికిచ్చినా మిగతా 14 మంది అభ్యర్థుల తరహాలో పనిచేసి బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని తీర్మానించుకున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తా, ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రేమ్ సింగ్ రాథోడ్, ఆల పురుషోత్తమ్‌రావు, పరమేశ్వరీ సింగ్, ముఖేష్ సింగ్, శంకర్ లాల్ యాదవ్, రాంచంద్రరాజు, శాంతిదేవి, సురేష్ ముదిరాజ్, దిలీప్ ఘనాటే, రాజశేఖర్, బిజిలి శ్రీనివాస్, రమేష్ గుప్తా సమావేశమయ్యారు.

అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ

గోల్కొండ: గోల్కొండ కోటలో మహంకాళి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆషాఢమాసపు బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు పూజలు జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారకి ఒడిబియ్యం సమర్పించి ఆలయ పూజారి సురేష్ చారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విష్ణుపాటిల్‌కు కాంస్య పతకం



జియాగూడ: జియాగూడ శాంతినగర్ శ్రీ శ్లోకా ది స్కూల్ విద్యార్థి విష్ణుపాటిల్ జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో కాంస్య పతకం సాధించడం హర్షణీయమని స్కూల్ ప్రిన్సిపాల్, నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో తెలంగాణ స్పోర్ట్స్, తెలంగాణ కరాటే డో చాంపియన్‌షిప్‌లో కోచర్ ఎంకే బాలాజీ నేతృత్వంలో శ్లోకా స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి విష్ణుపాటిల్ పోటీల్లో గెలుపొంది కాంస్య పతకం సాధించడం పట్ల స్కూల్ యాజమాన్యం అమిత చరణ్, రత్నేష్ జైస్వాల్, తిరుమల్‌రావు, సుఖ్‌పాల్, అన్వేష్ అభినందించారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ మాండలికాలు ఎంతో మధురమైనవని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళహంసి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి వడ్డేపల్లి కృష్ణ రచించిన తెలంగాణ ప్రముఖ కవులు కావ్యాలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ ప్రాంతంలో అసలు కవులే లేరని అవమానించారని గుర్తుచేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి, సినారే వంటి కవులు ఈ ప్రాంత సాహిత్యాన్ని వెలిగెత్తి చాటారని తెలిపారు. ఈ సందర్భంగా చిక్క రామదాసు నిర్వహణలో తెలంగాణ ప్రగతి అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్, కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ



గోల్కొండ: ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అగ్రరాజ్యంగా రూపొందిందని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుడిమల్కాపూర్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి 9 ఏళ్ల పాలనలో విజయాలను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ యాదవ్, శ్రీకాంత్ సాగర్, దేవీ శంకర్, అశ్విన్ మోదీ, సుధాకర్‌యాదవ్ తదితరులున్నారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా కృషి



నందకిశోర్ వ్యాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. తెలంగాణ క్రీడాకారులు ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని చాటుతున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం నందకిశోర్ వ్యాస్ బిలాల్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే క్రీడాకారులు ఆటలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారని ఆయన అన్నారు. నితిన్ నంద్‌కర్, వినోద్ యాదవ్, పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

కారు బీభత్సం

చాంద్రాయణగుట్ట: కారు బీభత్సం సృష్టించిన ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. జహనుమాకు చెందిన ఇంతియాజ్(42) తన కుమారుడు బషీర్‌తో కలిసి గురువారం రాత్రి ఇన్నోవా కారులో పురానీహవేలీకి వెళ్తుండగా మార్గం మధ్యలో అలియాబాద్ వద్ద ఇన్నోవా కారు బ్రేక్ కొట్టే బదులు ఎక్స్‌లెటర్ నొక్కాడు. దీంతో కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న బుల్లెట్ బైక్‌ను ఢీకొడుతూ క్యాటరింగ్ దుకాణంలోకి దూసుకెళ్లింది. బుల్లెట్ బైక్ పైన ఉన్న జుబేర్ ఖాన్‌కు తీవ్ర గాయాలవ్వడంతో పాటు క్యాటరింగ్ దుకాణం ధ్వంసమయ్యింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

చైల్డ్ స్కేప్, మీడియా స్కేప్ పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: పిల్లలు, మీడియా పద్ధతులపై విస్తృతమైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్ అన్నారు. శుక్రవారం సైఫాబాద్‌లోని విద్యాఅరణ్య స్కూల్‌లో ఓరియంట్ బ్లాక్ స్వాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉషారామణ్, పరిశోధకురాలు సుమన కస్తూరి ఆధ్వర్యంలో రచించిన చైల్డ్ స్కేప్, మీడియా స్కేప్ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలే భవిష్యత్తు అని విస్తృతంగా చెబుతున్నప్పటికీ వారి పద్ధతులపై పరిశోధనలు క్లిష్టమైన పని అని తెలిపారు. మానవ హక్కుల న్యాయవాది సుధామురళి తదితరులు పాల్గొన్నారు.